సాక్షి ప్రకాశం

శనివారం । 6 । జూలై । 2024



జూలీ.. స్వీటీ.. మ్యాగీ.. టైగర్.. భద్రమేనా?
పెంపుడు జంతువుల యజమానులు జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. నేడు వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా జూనోటిక్ వ్యాధులపై ప్రత్యేక కథనం... - 8లో..



మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించాలి
మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధిని నిషేధించడం, ఆ కార్మికులకు పునరావాస చట్టం అమలు చేయడాన్ని పాటించాలని జాతీయ సఫాయి కరమ్‌చారి కమిషన్ సభ్యుడు వావా సూచించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36/27

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: ఎన్నికల ఫలితాల అనంతరం దర్శి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు శుక్రవారం ఆర్థికసాయం చెక్కులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి గురువారం దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు చెక్కులు అందజేశారు. వాటిని శుక్రవారం దర్శి నియోజకవర్గంలోని బాధిత కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. తూర్పువీరాయపాలెం గ్రామంలో టీడీపీ దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ముప్పరాజు కోటేశ్వరమ్మ, ముప్పరాజు వెంకటేశ్వర్లుకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అందజేశారు.

వై.పాలెం ఎస్సైపై సస్పెన్షన్ వేటు

యర్రగొండపాలెం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యర్రగొండపాలెం ఎస్సై సుదర్శన్‌ను ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ శుక్రవారం సస్పెండ్ చేశారు. ఎస్సైపై వచ్చిన అవినీతి ఆరోపణలపై మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావుతో విచారణ జరిపించారు. పలువురు బాధితులను విచారించిన డీఎస్పీ.. ఆ నివేదికను ఎస్పీకి పంపారు. ఎస్సై అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

జర్నలిస్ట్ ప్రమాద బీమాను రెన్యువల్ చేయించుకోవాలి

ఒంగోలు సెంట్రల్: గత సంవత్సరం ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించినట్లు సంఘ బాధ్యులు తెలిపారు. ఆ బీమాను తిరిగి ఉచితంగానే రెన్యువల్ చేసుకోవాలని, నూతన జర్నలిస్టులు కూడా నమోదు చేసుకోసుకోవాలని కోరారు. వివరాలకు 9440925092, 9182095153 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



ప్రబలుతున్న డయేరియా నియంత్రణలో ప్రభుత్వంతో పాటు అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోంది. దోమలపై దండయాత్ర చేసే ప్రభుత్వం అంతకు మించి ఏం చేస్తుందిలే అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'స్టాప్ డయేరియా' అంటూ వైద్యారోగ్యశాఖ అధికారులు సమావేశాలు, కరపత్రాల ఆవిష్కరణలు, పత్రికా విలేకర్ల సమావేశాలతో హడావిడి చేస్తున్న తీరు చూస్తే 'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా' అనే సామెత గుర్తుకు వస్తోంది. వాతావరణ మార్పులు.. నైరుతీ ప్రభావంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలుతున్నాయి. క్షేత్ర స్థాయిలో తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయి.

స్టాప్ డయేరియా.. ఏందయ్యా!

డయేరియా ఎందుకు వస్తుంది...?
డయేరియా ఎక్కువగా మే, జూన్ మాసాల్లో కనిపిస్తుంది. తాగునీరు కలుషితం కావడం దీనికి ప్రధాన కారణం. కలుషిత ఆహారం కూడా ముఖ్య కారణంగా చెప్పవచ్చు. వర్షాకాలంలో నీరు కలుషితం కావడంతో నీటిలోని బ్యాక్టీరియా వల్ల విరేచనాలు అవుతాయి. కలుషిత నీరు, ఆహారంలోని ఈ కోలి, రోటా వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి డయేరియాకి కారణం అవుతున్నాయి. రోజు మొత్తం మీద 4 సార్లకంటే ఎక్కువగా నీళ్ల విరేచనాలైతే వెంటనే శరీరంలోని నీటి శాతం తగ్గి డీ హైడ్రేషన్ ఏర్పడుతుంది. ఇది ఒక్కోసారి ప్రాణాంతకమవుతుంది. పెద్దలకంటే చిన్నారులకు ఇది మరింత ప్రమాదకరం.

- ఓఆర్ఎస్ ప్యాకెట్లతో నియంత్రణ సాధ్యమా..?
- నామమాత్రంగా పారిశుద్ధ్య చర్యలు
- ముందస్తు జాగ్రత్తల్లో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలం
- హోటళ్ల పరిశుభ్రత గురించి పట్టించుకోని అధికారులు
- సమావేశాలు, ప్రెస్‌మీట్లతోనే సరి

ఒంగోలు టౌన్:

గత ప్రభుత్వం ప్రపంచాన్ని వణికించిన కరోడా లాంటి కరోనానే పటిష్టమైన ప్రణాళికలతో నియంత్రించింది. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రణాళికలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇక సీజనల్ వ్యాధుల నియంత్రణలో కూడా ముందస్తు జాగ్రత్తలు, ప్రణాళికలతో ఎక్కడా ప్రబలకుండా చర్యలు చేపట్టింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం డయేరియాను కంట్రోల్ చేయలేక చేతులెత్తేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. డయేరియా నియంత్రణకు సాక్షాత్తూ సీఎం చంద్రబాబు మళ్లీ దోమలపై దండయాత్రకు ప్రణాళిక ప్రకటిస్తే.. 'స్టాప్ డయేరియా' అంటూ అధికారులు బ్యానర్లు పట్టుకుని ప్రచారం చేస్తున్న తీరు చూసి జనం నవ్విపోతున్నారు. 'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా'.? అంటూ సెటైర్లు వేస్తున్నారు.

ఏవీ ముందస్తు చర్యలు..?
ఒకప్పుడు మే, జూన్ నెలల్లో జీరో నుంచి 5 ఏళ్ల చిన్నారులు అతిసార బారిన పడేవారు. సరైన చికిత్స లభించకపోవడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రతి ఏడాది జూలై 1 నుంచి 15 రోజుల పాటు డయేరియా పక్షోత్సవాలు నిర్వహించేవారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర వైద్య కుటుంబ సంక్షేమ శాఖ తాజాగా 'స్టాప్ డయేరియా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రజలు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు 2 నెలల పాటు సుదీర్ఘ ప్రచారం నిర్వహించనున్నారు. అయితే, కేవలం ఇంటింటికి తిరిగి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో మాత్రమే సరిపోతుందా అంటే లేదనే చెప్పాలి. జిల్లాలో నీటి నిర్వహణ పరిస్థితులపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయకుండా కేవలం కంటితుడుపు చర్యలు తీసుకోవడం వలన ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

పశ్చిమాన పెరుగుతున్న కేసులు...
జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో డయేరియా వ్యాధి తీవ్రంగా భయపెడుతోంది. యర్రగొండపాలెం, గిద్దలూరు, కంభం, మార్కాపురం, దోర్నాల, త్రిపురాంతకం, పొదిలి తదితర ప్రాంతాల్లో గత 15 రోజులుగా విస్తరిస్తోంది. పీహెచ్‌సీ, ఏరియా వైద్యశాలలకు వచ్చే రోజువారీ కేసుల్లో డయేరియా కేసులు ఉంటున్నాయి. పీహెచ్‌సీలలో ప్రతిరోజూ 3 నుంచి 4 కేసులు వస్తున్నట్లు తెలుస్తోంది. గత వారంలో కంభం ప్రాంతంలో ఈ కేసుల సంఖ్య మరింత ఎక్కువగా నమోదైంది. డయేరియా కేసులతో ప్రైవేటు వైద్యశాలలు కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ వైద్యుల వద్ద కూడా ఈ రద్దీ కనిపిస్తోంది. ఇక ఒంగోలు జీజీహెచ్‌లో కూడా ప్రతిరోజూ కనీసం 10 నుంచి 20 కేసులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. నగరంతో పాటుగా పరిసరాల నుంచి రోగులు ఎక్కువగా వస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క జీజీహెచ్‌కే రోజుకు 20 కేసుల వరకు వస్తున్నాయంటే అంతకు రెట్టింపు రోగులు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్తున్నట్లు సమాచారం.

హోటళ్లలో పొంచి ఉన్న ప్రమాదం...
ఇంట్లో తినడం కంటే బయట హోటళ్లు, రెస్టారెంట్లలో తినడం ప్రస్తుతం ఎక్కువైపోయింది. వీధికో బిర్యానీ పాయింట్ వెలిసింది. ప్రతి వీధిలోనూ టిఫిన్ సెంటర్లు దర్శనమిస్తున్నాయి. బజ్జీ, బోండాల బండ్లకు లెక్కేలేదు. ఇవన్నీ ఎంత వరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయంటే దాదాపుగా చాలా తక్కువనే చెప్పాలి. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇలా ఎఫ్ఎస్ఎస్ఏఐ సరిఫికెట్లు కలిగిన రెస్టారెంట్లు కేవలం 722 మాత్రమే ఉన్నాయి. ఇందులో పెద్ద రెస్టారెంట్లు 421 ఉండగా, చిన్న రెస్టారెంట్లు 293 ఉన్నాయి. 171 హోటళ్లు, 78 టీ, కూల్ డ్రింక్స్ దుకాణాలు, 56 మొబైల్ టిఫిన్ బండ్లు, 402 బేకరీలు, చికెన్ పకోడీ సెంటర్లు, ఇతర తినుబండరాల దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతులు లేని హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు కొన్ని వేల సంఖ్యలో ఉంటాయని అంచనా. ఇక్కడ పారిశుధ్యంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో హోటళ్లలో పనిచేసే వంట మాస్టర్లు, ఇతర సిబ్బందికి తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి నుంచి టైఫాయిడ్, కామెర్లు, అతిసార లాంటి వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. డయేరియాను నియంత్రించాలంటే హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర తినుబండరాల వ్యాపారులపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

జిల్లాలో 1.50 లక్షల చిన్నారులు...
స్టాప్ డయేరియాలో జీరో నుంచి 5 సంవత్సరాల చిన్నారులను లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. జిల్లాలో 716 మంది ఏఎన్ఎంలు, 2028 మంది ఆశా కార్యకర్తలు, 552 మంది సీహెచ్‌ఓలు ఉన్నారు. వీరి ద్వారా సర్వే నిర్వహించి 1.50 లక్షల మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. డయేరియా ముందస్తు చర్యల్లో భాగంగా చిన్నారులున్న ప్రతి ఇంటికీ రెండేసి ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఓఆర్ఎస్ వినియోగించే విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అయితే, ఓఆర్ఎస్ పాకెట్లను నామమాత్రంగా పంపిణీ చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. విరేచనాలు అవుతున్నప్పుడు ఎలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలో చెప్పకపోవడంతో అనేక మంది తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ఆర్ఎంపీలు, పీఎంపీల దగ్గరకు తీసుకెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. అక్కడ రెండు రోజులపాటు చికిత్స చేయించి అప్పటికీ తగ్గకపోతే పట్టణాలకు పరుగులు పెడుతున్నారు.

ప్రతిరోజూ డయేరియా కేసులు వస్తున్నాయి



ఒంగోలు జీజీహెచ్‌లో రోజువారీ ఓపీల్లో 10 నుంచి 20 వరకు డయేరియా కేసులు వస్తున్నాయి.సివియర్ కేసులు తక్కువే ఉంటున్నాయి. మైల్డ్, మోడరేట్ కేసులను ఫ్లూయిడ్స్ పెట్టి తగ్గిస్తున్నాం. గ్రామాల్లోని పీహెచ్‌సీలు, ఏరియా వైద్యశాలలు, అర్బన్ వైద్యశాలలు బలోపేతం కావడంతో స్థానికులకు అక్కడే చికిత్స చేస్తున్నారు.
– డాక్టర్ వి.చెంచయ్య, ఇన్‌చార్జి ఆర్ఎంఓ, ఒంగోలు జీజీహెచ్

అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం



స్టాప్ డయేరియాలో భాగంగా వైద్యారోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని అన్నీ రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. కలుషిత నీరు సరఫరా కాకుండా సంబంధిత అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. జిల్లాలోని అన్నీ హెల్త్ అండ్ వెల్త్ సెంటర్లలో ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా కార్నర్లు ఏర్పాటు చేశాం. అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవడం వలనే జిల్లాలో డయేరియా కేసులు తక్కువగా నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలో 24 గంటలు పనిచేసేలా టోల్ ఫ్రీ నంబర్ 9515324799 ఏర్పాటు చేశాం.
– డాక్టర్ సురేష్ కుమార్, డీఎంహెచ్ఓ

టీడీపీ రౌడీ రాజకీయం!

- దర్శి నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ
- కొత్త సంస్కృతి తీసుకొస్తున్న గొట్టిపాటి లక్ష్మి
- రోజురోజుకూ బరితెగిస్తున్న టీడీపీ శ్రేణులు
- తాజాగా దొనకొండలో వీరంగం
- ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ అడ్డగింత
- నియోజకవర్గంలో సన్నగిల్లుతున్న శాంతి భద్రతలు



పోలీసు బందోబస్తు మధ్య ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నేతలు

సాక్షి నెట్‌వర్క్: దర్శి నియోజకవర్గంలో టీడీపీ రౌడీ రాజకీయం రోజురోజుకూ శ్రుతిమించిపోతోంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన గొట్టిపాటి లక్ష్మి, ఆ పార్టీ శ్రేణులు అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న తీరుతో నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. తరచూ శాంతి భద్రతల సమస్య తలెత్తుతోంది. శుక్రవారం దొనకొండలో జరిగిన సంఘటనతో ప్రజాస్వామ్యవాదులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో దర్శి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గొట్టిపాటి లక్ష్మి కొత్త సంస్కృతి తీసుకొస్తున్నారు. రౌడీ రాజకీయమే తన ఇజమని నిరూపిస్తున్నారు. ఎన్నికల సమయంలో నరసరావుపేట నుంచి రౌడీలను దించి దాడులు చేయించి దర్శి నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. ప్రశాంతంగా ఉన్న దర్శిలో ఆరని చిచ్చు రాజేశారు. తాజాగా శుక్రవారం దొనకొండ మండల సర్వసభ్య సమావేశానికి ప్రొటోకాల్ ఆహ్వానం మేరకు హాజరయ్యేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను అడ్డుకున్నారు. బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి సమావేశానికి వస్తారని ముందుగానే తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఒక ప్లాన్ ప్రకారం ఉదయం నరసరావుపేట వెళ్లి గొట్టిపాటి లక్ష్మిని కలిశారు. ఆమె సూచనల మేరకు అక్కడి నుంచి మరికొంత మంది రౌడీలతో కలిసి దొనకొండ వచ్చారు. ముందస్తు ప్లాన్ ప్రకారం బూచేపల్లి వారిపై దాడులు చేయాలని 50 మందికిపైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాళ్లు పెట్టుకుని వేచి ఉన్నారు. బూచేపల్లి వస్తున్నారని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా భారీగా మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దీంతో రాళ్లదాడి ప్లాన్ కుదరలేదు. ఎలాగైనా వారిని లోనికి రాకుండా చేయాలని కుట్ర పన్ని వారు వచ్చే సమయానికి గేట్లు వేసి లోపల గడియలు పెట్టారు. అక్కడకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలను లోనికి రాకుండా అడ్డుకుని రాజ్యాంగ విలువలు మంటగలిసేలా ప్రవర్తించారు. జై చంద్రబాబు.. బూచేపల్లి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. మాకు అధికారం వచ్చింది.. మా ప్రభుత్వం.. మా ఇష్టం.. మీరెందుకు వచ్చారంటూ దురుసుగా మాట్లాడారు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన ఎంపీడీఓ,పోలీసులను అసభ్య పదజాలంతో దూషించారు. ప్రొటోకాల్ ప్రకారం లోనికి అనుమతించకపోవడం నేరమని సీఐ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా గంటన్నరకుపైగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్లను గేటు బయటే ఉంచడంతో పోలీసు బందోబస్తుతో గేట్లు తెరిపించి జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలను సర్వసభ్య సమావేశానికి సీఐ తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా దొనకొండ చేరుకున్నారు.



బూచేపల్లి కారును అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

నెల రోజుల్లోనే అనేక ఘటనలు...
తూర్పువీరాయపాలెం గ్రామంలో ముప్పరాజు కోటేశ్వరమ్మ, ముప్పరాజు వెంకటేశ్వర్లు ఇంటిపైకి వెళ్లి టీడీపీ శ్రేణులు దాడి చేశారు. వారి తలలు పగులకొట్టారు. కొచ్చర్లకోట పంచాయతీ పరిధిలోని చొప్పరపు బాలస్వామి, సింహపురి లలిత ఇంటిపై దాడులు చేసి వారి తలలు పగులకొట్టారు. ఇటీవల నరసరావుపేటకు చెందిన రౌడీలు దర్శి పట్టణానికి చెందిన కుందురు నరసింహారెడ్డి ఇంటిపై అర్ధరాత్రి దాడి చేశారు. ఇంటి బయట ఉన్న సామగ్రి, లైట్లను ధ్వంసం చేసి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నేతకు చెందిన బార్ షాపును తామే నడుపుకోవాలంటూ ఆ బార్‌కు తాళాలు వేసి స్వాధీనం చేసుకుని నరసరావుపేట వాళ్లే ప్రస్తుతం నడిపిస్తున్నారు. ఇవే కాకుండా గ్రామాల్లో చిన్న చిన్న ఘటనలు అనేకం జరిగాయి. టీడీపీ నేతల వేధింపులు బయటకు చెప్పుకోలేక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఇన్ని దుర్మార్గాలకు పాల్పడితే.. ఇక మున్ముందు మరెన్ని అరాచకాలు చేస్తారో అని నియోజకవర్గ ప్రజలు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

బీసీ ఎంపీపీపై దాడికి యత్నం...
బీసీ యాదవ కులానికి చెందిన దొనకొండ ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళిపై శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కమ్మ సామాజికవర్గానికి చెందిన ఆరవల్లిపాడు టీడీపీ మహిళా ఎంపీటీసీ, కమ్మ సామాజికవర్గానికి చెందిన వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు, మరో వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి దాడి చేసేందుకు ప్రయత్నించారు. మహిళ అని కూడా చూడకుండా పదే పదే అవమానకరంగా మాట్లాడుతూ దాడికి యత్నించారు. ఎంపీపీని భయభ్రాంతులకు గురిచేశారు. ఎంపీపీ కుర్చీలో నేను కూర్చోవాల్సిందంటూ విచక్షణా రహితంగా మాట్లాడారు. మహిళా ఎంపీపీ అని కూడా చూడకుండా ఆమె మనోభావాలు దెబ్బతినే విధంగా సర్వసభ్య సమావేశంలో వారు ప్రవర్తించిన తీరుతో తోటి ఎంపీటీసీలు, సర్పంచులు సైతం ముక్కున వేలేసుకున్నారు.

బదిలీల కోసం ఎదురుచూపులు

- ఎన్నికల సమయంలో బదిలీ అయిన అధికారులు, ఉద్యోగుల నిరీక్షణ
- ఎటువంటి చర్యలూ చేపట్టని ప్రభుత్వం
- ఇతర జిల్లాల్లో ఉద్యోగ బాధ్యతలతో ఇక్కట్లు

మార్కాపురం: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఐలు, ఎస్సైలు, ఇతరత్రా శాఖల ఉన్నతాధికారులు, మూడేళ్లకు మించి జిల్లాలో పనిచేసిన ఉద్యోగులను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాపట్ల, పల్నాడు, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు బదిలీపై పంపారు. గత నెల 8వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులంతా సుమారు 20 రోజుల నుంచి సొంత జిల్లాకు వచ్చేందుకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో మనసు ఇక్కడ.. ఉద్యోగం అక్కడ అన్నట్లుగా అధికారుల పరిస్థితి తయారైంది. మూడు నెలలకల్లా మళ్లీ సొంత జిల్లాకు రావచ్చనే ఆశతో వెళ్లిన గెజిటెడ్ ఆఫీసర్లంతా ప్రస్తుతం నిరాశ నిస్పృహలో ఉన్నారు. జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లోని రెవెన్యూ, పోలీసు, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు జెడ్పీ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, డీఆర్‌డీఏ, తదితర విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 250 నుంచి 300 మందికిపైగా అధికారులు, ఉద్యోగులు జిల్లాకు సరిహద్దు జిల్లాలైన బాపట్ల, పల్నాడు, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు ఎన్నికల విధుల నిమిత్తం వెళ్లారు. వారి కుటుంబాలు మాత్రం సొంత ఊర్లలోనే ఉన్నాయి. ఉద్యోగం మాత్రం పక్క జిల్లాలో కావడంతో అవస్థలు పడుతున్నారు. కొంత మంది కుటుంబ బాధ్యతలు, అనారోగ్య సమస్యలు, పిల్లల చదువుల కోసం వెంటనే సొంత ఊర్లకు వచ్చేందుకు ఎదురుచూపులు చూస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని పలువురు రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులను పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు బదిలీ చేశారు. ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను మార్కాపురం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు తహసీల్దార్లుగా, ఎంపీడీఓలుగా, ఎస్సైలుగా నియమించారు. పలువురు డిప్యూటీ తహసీల్దార్లను కూడా నియోజకవర్గాలు మార్చారు. ఎన్నికల కోడ్ తొలగించిన వెంటనే మళ్లీ సొంత మండలాలకు రావచ్చని వారంతా భావించారు. కానీ, ఆలస్యం కావడంతో నిరాశ చెందుతున్నారు. బదిలీల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు...
ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు, ఉద్యోగులంతా బదిలీల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు అధికారులు వారిని కలిసి లెటర్లు తీసుకుని ఉన్నతాధికారులకు అందించారు. కలెక్టర్, ఎస్పీలకు సిఫార్సు చేయించుకున్నారు. అయితే, ప్రభుత్వం నుంచి బదిలీల ఉత్తర్వులు రాకపోవడంతో ఆ జీవో తెప్పించుకునేందుకు తమ అసోసియేషన్ల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమిషనర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా మున్సిపాలిటీల్లో ఉన్న గృహాలు, తాగునీటి సరఫరా డిమాండ్, ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న తీరు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు నగర పరిధిలో తాగునీటి సరఫరా గురించి వివరించారు. ప్రస్తుతం రెండు నెలలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని తెలిపారు.



మున్సిపల్ కమిషనర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రామతీర్థం నుంచి స్థానిక చెరువులకు నీటిని తరలించి నిల్వ చేశామన్నారు. కొత్తగా కార్పొరేషన్‌లో విలీనమైన 37 గ్రామాలకు 35 ట్యాంకర్ల ద్వారా రోజుకు 250 ట్రిప్పుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఇతర మున్సిపాలిటీల్లో కూడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పాలన, ఆర్థికపరమైన అంశాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు కమిషనర్‌తో పాటు మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, దర్శి మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.362

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు కేజీ గరిష్ఠ ధర గురువారం రూ.362 పలికినట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 4,251 బేళ్లు వేలానికి రాగా, 3,854 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 397 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి వేలం కేంద్రాల్లో 97వ రోజు వేలం పాటకు 2,864 బేళ్లు రాగా, 2,663 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 201 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.362 పలకగా, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.197.96 పలికింది. డీసీపల్లి, కలిగిరి, కందుకూరు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాలలో 92వ రోజు నిర్వహించిన వేలంపాటలో 1,387 బేళ్లు వేలానికి రాగా, 1,191 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 196 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.360, కనిష్ఠ ధర రూ.204, సరాసరి ధర రూ.240.32 పలికింది.

పొగాకు వేలాన్ని పరిశీలించిన ఆర్ఎం
కొండపి (సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన వేలాన్ని ఒంగోలు పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) లక్ష్మణరావు పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సంవత్సరం కూడా పొగాకు బోర్డులోనే సూర, బిట్లు, పండుగుల్ల ఆకు కొనుగోలు చేస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్, బొడ్డపాటి బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

పొగాకు చూర, ముక్క గరిష్ఠ ధర రూ.148...
కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు చూర, ముక్క గరిష్ఠ ధర రూ.148 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని ఎస్.ఎన్.కండ్రిక, పెట్లూరు, జగ్గరాజుపాలెం, అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకట్లగుంట గ్రామాల రైతులు 709 బేళ్లను వేలానికి తీసుకురాగా, వాటిలో 519 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 190 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.148 పలకగా, కనిష్ఠ ధర రూ.59, సరాసరి ధర రూ.81.37 పలికింది. వేలంలో నలుగురు వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: ఈనెల 8న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను శుభ్రపరచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడంతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు. మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద 8వ తేదీ ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్

ఒంగోలు: బ్రిలియంట్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏ1 ఫంక్షన్ హాల్లో శనివారం మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ షేక్ న్యామతుల్లా బాషా తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ సెమినార్‌లో బీటెక్, మెడికల్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు వెబ్ ఆప్షన్లపై అవగాహన కల్పించడంతోపాటు వారికి ఏయే కోర్సుల్లో చేరాలనే విషయమై దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్శిటీల ప్రతినిధులతో సూచనలు, సలహాలు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తదితరులు పాల్గొంటారని బ్రిలియంట్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ తాహురా తెలిపారు.

ఆధార్ నమోదుతో హిజ్రాలకు మెరుగైన లబ్ధి


ఒంగోలు సెంట్రల్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జీవనం సాగిస్తున్న హిజ్రాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల ప్రయోజనాల కోసం హిజ్రాల విభాగంలో తమ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జి.అర్చన తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయ ఫోన్ నంబర్ 08592 281310ను పని వేళల్లో సంప్రదించాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.


డీఎస్ మహిళా కాలేజీలో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో నూతన జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.30 వేలు మొదలు రూ.50 వేల వరకు సంపాదన ఇవ్వగల మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ డిగ్రీ కోర్సు ఉన్న ప్రభుత్వం కాలేజీ ప్రకాశం జిల్లాలో తమది మాత్రమేనన్నారు. బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ నాలుగో సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని, బీఎస్సీ కెమిస్ట్రీ మూడు సంవత్సరాలు పూర్తిచేసిన వారు నాలుగో సంవత్సరంలో ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చేసిన వారు ఈ కోర్సులో నేరుగా మొదటి సంవత్సరంలో చేరవచ్చని, అదే విధంగా నాలుగేళ్ల బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు పీజీలో నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చని స్పష్టం చేశారు. బీకాం కోర్సు అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు.

జూలీ.. స్వీటీ.. మ్యాగీ.. టైగర్.. భద్రమేనా?

ఒంగోలు సెంట్రల్: పశువుల నుంచి మనుషులకు. మనుషుల నుంచి పశువులకు సంక్రమించే స్వభావం ఉన్న జబ్బులను జూనోటిక్ వ్యాధులు(సక్రమిత వ్యాధులు)గా పేర్కొంటారు. ప్రపంచంలో సుమారు 200కు పైగా జూనోటిక్ వ్యాధులు ఉన్నట్లు ఇప్పటికే శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఎక్కువగా పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, రైతులు, పశు వైద్యులు, జంతు ప్రదర్శనశాలల సిబ్బంది, పరిశోధనశాలల్లో పని చేసే సిబ్బందికి ఉంటుంది. శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొట్టమొదటిసారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తి ప్రాణాలను ‘యాంటీ రేబిస్ టీకా’తో కాపాడిన సందర్భంగా ఏటా ఈ రోజును ‘జూనోసిస్ డే’ నిర్వహిస్తున్నారు.





● జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త
● పశువుల నుంచి మానవులకు సంక్రమించేందుకు అవకాశం
● పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకే అధిక ప్రమాదం
● అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ముప్పు
● రేబిస్, బర్డ్‌ఫ్లూ, ఆంత్రాక్స్ ఈ కోవలోనివే..
● జిల్లా మొత్తం పశు సంపద 35,46,289
● నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

వైరల్, ప్యారాసైటిక్..

జూనోసిస్ వ్యాధులను వైరస్ బ్యాక్టీరియల్, ప్యారాసైటిక్ వ్యాధులుగా విభజించారు. వైరస్ వల్ల సంక్రమించే జబ్బుల్లో పిచ్చికుక్క కాటు వ్యాధి(రేబిస్), మెదడువాపు(జపనీస్ సెఫలైటిస్), బర్డ్ ఫ్లూ ముఖ్యమైనవి. బ్యాక్టీరియా కారణంగా సంక్రమించే జబ్బుల్లో బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోసైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం ముఖ్యమైనవి. పరాన్న జీవుల వల్ల సక్రమించే ఈ వ్యాధుల్లో బద్దె పురుగులు, ఏలిక పాములు, ఫైలేరియా హైడాటిడ్ ముఖ్యమైనవి. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జంతువులు, మానవుల మధ్య వ్యాధుల వ్యాప్తిని నిరోధించటంలో మన ఉమ్మడి బాధ్యతను గుర్తు చేస్తుంది. వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడటంతోపాటు మానవుల, జంతువుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

అవగాహన అవసరం

జూనోటిక్ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. జంతు ఆరోగ్యం, జూనోసిస్‌పై వర్క్‌షాప్‌లు లేదా సెమినార్లకు హాజరు కావాలి. అనుమానిత జూనోటిక్ వ్యాధులను గుర్తిస్తే పశు వైద్యులు, అధికారులకు తెలియజేయాలి. జంతు ఉత్పత్తులను పూర్తిగా వండటం, సురక్షితమైన ఆహార నిర్వహణ పాటించాలి. వ్యాధులను వ్యాప్తి చేసే కీటకాలు, ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.



తాళ్లూరు మండలం విఠలాపురంలో గేదెలకు టీకా వేస్తున్న పశువైద్యుడు

పాడి రైతులకు..

బలమైన జీవభద్రతా చర్యలను అమలు చేయాలి. పశువుల దగ్గరకు అవసరమైన వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాద రక్షలు, రక్షిత దుస్తులు ఉపయోగించాలి. పశుశాలలు, పాలు పిండే ప్రదేశాలు, పరికరాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. పాలు పిండేటప్పుడు కఠినమైన పరిశుభ్రత నియమాలను అమలు చేయాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. అనారోగ్యంతో ఉన్న జంతువులను వెంటనే మంద నుంచి వేరు చేయాలి. జూనోటిక్ వ్యాధుల ప్రమాదాలు, నివారణ చర్యలపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతోపాటు అవసరమైనప్పుడు వ్యక్తిగత రక్షణ పరికరాల వాడకాన్ని ప్రోత్సహించాలి.

కోళ్ల రైతులకు..

కోళ్లను పెంచే ప్రాంతాల్లో ప్రత్యేక దుస్తులు, పాదరక్షలను ఉపయోగించాలి. ఒకే వయసున్న పక్షులను కలిపి పెంచడం, గుంపుల మధ్య పూర్తిగా శుభ్రపరచి, ఆ ప్రాంతంలో క్రిమి సంహారక మందులు చల్లాలి. అడవి పక్షులతో సంపర్కాన్ని నివారించడానికి వలలు లేదా మూసివేసిన గూళ్లను ఉపయోగించాలి. ఆహారం తీసుకోవడంలో లేదా గుడ్ల ఉత్పత్తిలో తగ్గుదల లాంటి అనారోగ్య లక్షణాలు, అసాధారణ మరణాలను గుర్తిస్తే పశువైద్యాధికారులకు తెలియజేయాలి. పక్షులు లేదా గుడ్లను తాకిన తర్వాత చేతులు పూర్తిగా శుభ్రం చేసుకోవాలి.

జిల్లాలో పశు సంపద ఇలా..

తెల్లపశువులు	56,332
నల్ల పశువులు	6,71,812
గొర్రెలు	15,67,122
మేకలు	4,17,589
కోళ్లు	8,33,434
మొత్తం	35,46,289

పెంపుడు జంతువులకు టీకా తప్పనిసరి

- పెంపుడు జంతువుల్లో రేబిస్ నివారణ కోసం టీకాలు సకాలంలో వేయించడం ముఖ్యం. పశువైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి.
- పెంపుడు జంతువులను, వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవడంతోపాటు లిట్టర్ బాక్సులు, పంజరాలను తరచుగా శుభ్రం చేయాలి.
- బయట తిరిగే జంతువులను క్రమం తప్పకుండా క్రిములను తొలగించాలి. పెంపుడు జంతువులు అడవి జంతువుతో కలవకుండా చూడటంతో పాటు, సరైన రక్షణ లేకుండా గాయపడిన అడవి జంతువులను రక్షించడానికి ప్రయత్నించవద్దు.
- అనారోగ్య లక్షణాలు గమనించాలి. ప్రవర్తన లేదా ఆకలిలో మార్పులు అసాధారణమైనవిగా భావిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.

ముందస్తు నివారణ చర్యలు మేలు



జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల మనుషులకు, అటు జంతువులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ప్రాణాంతక జూనోసిస్ వ్యాధులపై సరైన అవగాహన ఉంటే చాలా వరకు అరికట్టవచ్చు. చిన్నారులకు ప్రాథమిక విద్య నుంచి జూనోసిస్ వ్యాధుల సంక్రమణ, నివారణపై అవగాహన పెంపొందించాలి. జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాల్లో శనివారం రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. జిల్లాకు 32,230 డోసుల రేబిస్ వ్యాక్సిన్ డోసులు వచ్చాయి.

– కె.బేబిరాణి, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి

మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధి నిషేధ చట్టం అమలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న వావ, కలెక్టర్ తమీమ్‌అన్సారియా

● పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
● జాతీయ సఫాయి కరమ్‌చారి కమిషన్ సభ్యుడు పీపీ వావ

ఒంగోలు అర్బన్: మాన్యువల్ స్కావెంజిగ్ ఉపాధిని నిషేధించడం, ఆ కార్మికులకు పునరావాస చట్టం అమలు చేయడాన్ని కచ్చితంగా పాటించాలని జాతీయ సఫాయి కరమ్‌చారి కమిషన్ సభ్యుడు పీపీ వావ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన జీజీహెచ్ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం ప్రకాశం భవనంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ తమీమ్‌అన్సారియాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో సఫాయి కరమ్‌చారీల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను ఆరా తీశారు. సఫాయి కార్మికుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. కోవిడ్‌తో చనిపోయిన సఫాయి కరమ్‌చారీలకు కోటి రూపాయలు పారితోషికం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్‌ను అడిగి ఎస్సీ, ఎస్టీ సఫాయి కరమ్‌చారీలు, మాన్యువల్ స్కావెంజర్లకు ఇచ్చే పథకాలు, పారితోషకాల గురించి తెలుసుకున్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధిని నిషేధించడం, పునరావాస చట్టం జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామన్నారు. వారి సమ్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీఓలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, డీపీఓ ఉషారాణి, ఓఎంసీ కమిషనర్ జస్వంత్‌రావు, సామాజిక కార్యకర్త మిట్నసల బెంజిమన్, లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్, డీఈఓ సుభద్ర, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్స్య రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యతో లబ్ధి

● జిల్లా మత్స్యశాఖాధికారి ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి

ఒంగోలు సెంట్రల్: మత్స్య రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యగా ఏర్పడి సంఘ సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ భవనాల సముదాయంలో ఎన్‌జీఓల సమావేశ మందిరంలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక మత్స్య సహకార సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లా మత్స్య శాఖాధికారి మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేసి ఎన్‌సీడీసీ, సీబీబీవో, పీఎంఎంఎస్‌వై ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం అందించేందుకు మత్స్య రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య విధివిధానాలను వివరించారు. కనిగిరి, పునుగోడు, అర్ధవీడు, మోహిద్దీన్‌పురం, చందవరం, కంభం, పులిపాడు జాలర్ల సహకార సంఘ సభ్యులు 49 మంది పాల్గొన్నారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎ.ఉషాకిరణ్, మత్స్య అభివృద్ధి అధికారులు, సహాయ పరిశీలకులు, గ్రామ మత్స్య సహాయకులు, సాగర మిత్రలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫిషరీస్ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

● త్వరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తాం
● కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల



పార్టీ నేతలతో మాట్లాడుతున్న దద్దాల నారాయణయాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ భరోసా ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. కార్యకర్తలకు మండల, గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా గ్రామ స్థాయిలో నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలోనే ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పీసీపల్లి మండల కన్వీనర్ జి.బొర్రారెడ్డి, పార్టీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, చింతం శ్రీనివాసులయాదవ్, ఆరు మండలాల పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన లారీలో మంటలు

● ప్రమాదంలో లారీ క్యాబిన్ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న లారీ క్యాబిన్

పెద్దదోర్నాల: పార్కింగ్ చేసి ఉన్న లారీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్యాబిన్ మొత్తం దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి పాండురంగారావు కథనం మేరకు.. పెద్దదోర్నాలకు చెందిన షేక్ రఫీ తన లారీని గత నాలుగు రోజులుగా మెకానిక్ షాపుల వద్ద పార్కింగ్‌లో ఉంచారు. లారీకి శుక్రవారం స్వల్ప స్థాయి మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా లారీలో మంటలు చెలరేగి ఇంజిన్, క్యాబిన్ పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ పాండు రంగారావు, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. బ్యాటరీ వద్ద షార్ట్ సర్క్యూట్‌ై మంటలు చెలరేగి ఉంటాయని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

జీజీహెచ్ సిబ్బందిపై ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల దాడి

ఒంగోలు టౌన్: జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఎంఎన్‌ఓలపై ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం... మెడికల్ ఐసీయూలో చికిత్స కోసం వచ్చిన ఒక మహిళ గురువారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని ఎం.హరికృష్ణ అనే ఎంఎన్‌ఓ దగ్గరుండి ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో ఎక్కించి పంపించేశారు. ఈ విషయం తెలిసిన రవిచంద్ర, మనోహర్, మరో ముగ్గురు అంబులెన్స్ డ్రైవర్లు హరికృష్ణతో వాగ్వాదానికి దిగి, దాడి చేశారు. అడ్డుపడిన శ్రీనివాసరెడ్డి అనే మరో ఎంఎన్‌ఓను కొట్టి. బయటకు వస్తే చంపుతామని బెదిరించినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఆర్‌ఎంఓ డాక్టర్ చెంచయ్య దృష్టికి తీసుకెళ్లారు. జీజీహెచ్ పరిసరాలు, లోపల సుమారు 30 వరకు అంబులెన్సులు ఉంటున్నాయి. గతంలో మాదిరి యూనియన్ లేకపోవడంతో తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయని, జీజీహెచ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

వేర్వేరు గ్రామాల్లో ముగ్గురు ఆత్మహత్య



వెంకటేశ్వరరెడ్డి మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు



అల్లూరమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మరో యువకుడు మృతి

ముండ్లమూరు: కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగా జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఐదురోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మరో యువకుడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు.. ముండ్లమూరు మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన బద్రి శ్రీకాంత్‌రెడ్డి(34) ఈనెల ఒకటో తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు గమనించి వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందగా వైద్యశాల నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.ఆంజనేయులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

పసుపుగల్లు గ్రామానికి చెందిన నలదిమ్మె వెంకటేశ్వరరెడ్డి (43) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. చిన ఉల్లగల్లు వద్ద పొలాల్లో చెట్ల పొదల్లో ఆయన మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శింగనపాలెం గ్రామానికి చెందిన పి.బ్రహ్మానాయుడు(35) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం అత్తగారి గ్రామం పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం గ్రామ పొలాల్లో చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ఆంజనేయులు చెప్పారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కంభం: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నకంభం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అల్లూరమ్మ(38) కూలీ పని చేస్తూ కాపురాన్ని నెట్టుకొస్తోంది. అయితే భర్త మద్యం తాగి తరచూ గొడవపడుతుండటంతో మనస్తాపం చెంది శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన శ్రీకాంత్‌రెడ్డి